సాక్షి అన్నమయ్య జిల్లా

శనివారం । 30 । డిసెంబర్ । 2023



ప్రకృతి సాగులో 'విజయ'నాదం

ప్రకృతి సాగులో కొమ్మూరు విజయ్‌కుమార్ కొత్త చరిత్ర లిఖించాడు. చిరు ధాన్యాల సాగులో సిరులు పండిస్తూ ఇతరులకు ఆదర్శనంగా నిలుస్తున్నాడు. -8లో



శాంతి భద్రతలు భేష్

పోలీస్ శాఖ సమర్థవంతమైన సిబ్బంది పనితీరు, మెరుగైన పోలీసింగ్ అమలువల్ల ఈ ఏడాది నేరాలు తగ్గాయని జిల్లా ఎస్పీ బి కృష్ణారావు తెలిపారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.240
రెండోరకం	రూ.100	రూ.178

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 218 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

2నుంచి గాలికుంటువ్యాధి నివారణ టీకా



టీకా పంపిణీ చేస్తున్న డాక్టర్ గుణశేఖర్ పిళ్లై

రాయచోటి టౌన్: వచ్చే ఏడాది జనవరి 2వ తేది నుంచి ప్రతి గ్రామంలోని రైతు భరోసా కేంద్ర పరిధిలో ఉన్న పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేయాలని అధికారులకు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్ పిళ్లై తెలిపారు. ఇప్పటికే జిల్లాలోని 30 మండలాలకు చెందిన మూడు డివిజన్లకు టీకాలు అందజేశామని తెలిపారు. టీకా వేయడం వల్ల ఆరు నెలల పాటు గాలికుంటు వ్యాధి సోకదని చెప్పారు.కార్యక్రమంలో రాయచోటి పశుసంవర్ధకశాఖ డీడీ డాక్టర్ మాల కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రాఫిక్ డిజైన్‌లో శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు గ్రాఫిక్ డిజైన్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రథమ్ మల్టీ స్కిల్లింగ్ ట్రెనింగ్ సెంటర్ రీజినల్ కో ఆర్డినేటర్ శ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రాఫిక్ డిజైన్ కోర్సుకు సంబంధించి రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మండలం లింగారెడ్డి గూడలోని తమ శిక్షణా కేంద్రంలో శిక్షణతోపాటు ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పిస్తోందన్నారు. 40 రోజులపాటు కొనసాగే ఈ శిక్షణలో 18–30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలని, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా లేదా ఏదేని ఒకేషనల్ కోర్సు చేసి ఉండాలన్నారు. ఇతర వివరాలకు 9063486822 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

సాధారణ చార్జీలతో సంక్రాంతి సర్వీసులు



కడప కోటిరెడ్డిసర్కిల్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బస్సులను సాధారణ ఛార్జీలతో నడపనున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. జనవరి 10 నుంచి జిల్లా లోని ఆరు డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుస్తాయన్నారు. హైదరాబాదుకు 90 బస్సులు, బెంగుళూరు 80, విజయవాడ 30, చెన్నై 10 బస్సులు, తిరుపతి, నెల్లూరు, కర్నూలు, అనంతపురంకు 30 బస్సులు కలిపి మొత్తం 240 బస్సులు రాకపోకలు సాగిస్తాయన్నారు. వీటికి అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం ఉందన్నారు.

తప్పుడు రాతలపై ఆగ్రహజ్వాల

ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికల్లో తప్పుడు రాతలపై వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు సేవలందిస్తున్న వలంటీర్ వ్యవస్థతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మంచిపేరు వస్తుండటంతో తమ అక్కసును వెళ్లగక్కుతున్నాయని, తమ పత్రికలో తప్పుడు రాతలు అచ్చువేయిస్తున్నారంటూ మండిపడ్డారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధుల్లా ఉన్న వలంటీర్ వ్యవస్థను నాశనం చేసేందుకు కుట్ర పన్నుతున్నాయన్నారు. ఇటివంటి కథనాలతో వలంటీర్ల మధ్య ఐక్యతను దెబ్బతీయలేవన్నారు. శుక్రవారం వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో నిరసన వ్యక్తం చేశారు.



వైఎస్సార్ జిల్లా పులివెందులలో ఈనాడు, ఆంధ్రజ్యోతి దినపత్రికలతో నిరసన తెలుపుతున్న వలంటీర్లు



పీలేరు: ఈనాడు, ఆంధ్రజ్యోతి దినపత్రికలు దహనం చేస్తున్న వలంటీర్లు

- వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో వలంటీర్ల నిరసన
- ఈనాడు, ఆంధ్ర జ్యోతి పత్రికల దహనం

పులివెందుల టౌన్/వాల్మీకిపురం: తప్పుడు రాతలు రాస్తే సహించేదిలేదంటూ వలంటీర్లు ఈనాడు, ఆంధ్రజ్యోతి దిన పత్రికల యాజమాన్యాలను హెచ్చరించారు. వైఎస్సార్ జిల్లా పులివెందుల పట్టణంలోని పూలంగళ్ల సర్కిల్ వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. వలంటీర్లు సమ్మెలోకి వెళుతున్నారని తప్పుడు వార్తలు ప్రచురించిన ఎల్లో మీడియాపై మండిపడ్డారు. మా జీవితాలలో వెలుగులు నింపి మాకంటూ ఒక గౌరవం నింపిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఎప్పటికీ సమ్మె చేసే పరిస్థితే లేదన్నారు. అనంతరం ఈనాడు, ఆంధ్ర జ్యోతి దినపత్రికల ప్రతులను చూపిస్తూ దహనం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జేసీఎస్ ఇన్‌చార్జి చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ నాయకులు కిరణ్‌కుమార్, నాగరాజు, సంపత్, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో..

అన్నమయ్య జిల్లా వాల్మీకిపురంలోని గాంధీబస్టాండ్ వద్ద ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలను వలంటీర్లు దహనం చేశారు. తమతో సమ్మె చేయించాలన్న ఎల్లో మీడియా కుట్రలు సాగవని చెప్పారు. సేవాభావంతో పని చేస్తున్న తమపై విషప్రచారం చేయడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. మరోసారి తప్పుడు రాతలు ప్రచురిస్తే గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు చేతపట్టి పచ్చమీడియాకు వ్యతిరేకంగా ఈనాడు డౌన్ డౌన్, ఆంధ్రజ్యోతి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు.

పీలేరులో..

గ్రామ వలంటీర్లు సమ్మెలోకి వెలుతున్నట్లు ఈనాడు, ఆంధ్రజ్యోతి దినపత్రికల్లో తప్పుడు రాతలు రాయడంపై గ్రామ వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నమయ్య జిల్లా పీలేరులో శుక్రవారం పలువురు గ్రామ వలంటీర్లు ఈనాడు, ఆంధ్రజ్యోతి దినపత్రికలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము సమ్మెకు వెలుతున్నట్లు ఎల్లో మీడియాలో వచ్చిన వార్తలు పూర్తిగా నిరాధారమైనవని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మాటకు కట్టుబడి పని చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి తమకు ఎంతో గౌరవం ఇస్తున్నారని పేర్కొన్నారు.



అన్నమయ్య జిల్లా వాల్మీకిపురంలో ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలను దహనం చేస్తున్న వలంటీర్లు

బి.కోత్తకోటలో..



బి.కొత్తకోటలో నిరసన వ్యక్తం చేస్తున్న వలంటీర్లు

బి.కొత్తకోట: ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిపై ఈనాడు రాసిన చవకబారు రాతలకు వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం బి.కొత్తకోటలో జరిగిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రసంగాన్ని వక్రీకరించి వలంటీర్లను చులకనగా చూసినట్టు రాసిన రాతలపై శుక్రవారం వలంటీర్లు భగ్గుమన్నారు. నాలుగో వార్డు సచివాలయం వద్దకు చేరుకున్న వలంటీర్లు ఈనాడుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి చేయని వ్యాఖ్యలను చేసినట్టుగా, వలంటీర్లు–ఎమ్మెల్యే మధ్య చిచ్చు పెట్టేలా రాయడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి రాతలను మానుకోవాలని హెచ్చరించారు. ఈ నిరసనలో వలంటీర్లు మమత, సునిత, ఉమాదేవి, మహేష్, మంజునాథరెడ్డి, భానుప్రకాష్, హరి, మనోజ్‌కుమార్‌రెడ్డి, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించాలి

రాయచోటి: జిల్లాలో వంద శాతం తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఓటర్ల జాబితా సవరణపై అధికారులతో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రత్యేక ఎలక్టరోల్‌పై బీఎల్‌ఓలు ప్రతి ఇంటికీ వెళ్లి పరిశీలన చేసి పటిష్టతవంతంగా జాబితాను రూపొందించాలన్నారు. పరిశీలనలో డబుల్ పొటోలు, డూప్లికేట్ ఓట్లు ఉంటే సరిచేయాలని సూచించారు. ఒక ఇంటిలో ఎంత మంది ఓటర్లు ఉంటే వారందరి ఓట్లు ఏ పోలింగ్‌స్టేషన్లో ఉన్నాయో సీరియల్ నంబర్లుగా పరిశీలించాలన్నారు. మరణాల కేసులు లేదా వలసలు మొదలైన వాటి తొలగింపులకు భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా అనుసరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌ఓ సత్నారాయణ, రాయచోటి, రాజంపేట, మదనపల్లె ఆర్డీఓలు రంగస్వామి, రామకృష్ణారెడ్డి, మురళి, తదితరులు పాల్గొన్నారు.

- జిల్లాలో వివిధ రాజకీయ పార్టీల నాయకుల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల స్థితి, ముసాయిదా జాబితా తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీసీ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, డీఆర్‌ఓ సత్యనారాయణ,, రాజంపేట, మదనపల్లె ఆర్డీఓలు రామకృష్ణారెడ్డి, మురళీ, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నుంచి వచ్చిన ఫిర్యాదులను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఓటర్ జాబితాకు సంబంధించి వచ్చిన ఫామ్స్ 6,7,8 పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలన్నారు.

సెమిస్టర్ ఫలితాల విడుదల



పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ, సీతఈ తదితరులు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలో నవంబర్ నెలలో నిర్వహించిన బీఈడీ, ఎంఈడీ రెండో సెమిస్టర్ పరీక్షా ఫలితాలను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఎంఈడీలో 72.34 శాతం, బీఈడీలో 85.92 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. గణాంకాలను విశ్లేషిస్తే బీఈడీ పరీక్షలకు 2117 మంది విద్యార్థులు హాజరుకాగా, 1819 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు.ఎంఈడీలో 47 మంది పరీక్షలకు హాజరుకాగా 34 మంది పాసయ్యారన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

పెండ్లిమర్రి: పొలతల శైవ క్షేత్రంలోని మల్లేశ్వర స్వామి దేవస్థానంలోని హుండీల ఆదాయాన్ని శుక్రవారం దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్ ఆధ్వర్యంలో లెక్కించారు. మల్లేశ్వరస్వామి, పార్వతిదేవి, అక్కదేవతలు, పులిబండెన్న స్వాములవారి హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ.18,82,222 లక్షల నగదు వచ్చింది. అలాగే 10గ్రాముల బంగారు, 1కేజీ 200 గ్రాముల వెండి కూడా వచ్చినట్లు అధికారులు తెలిపారు.కార్యక్రమంలో ఆలయ చైర్మన్, నాగమల్లారెడ్డి, ఈఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిత



విద్యార్థుల తల్లులకు మెగా చెక్కును అందజేస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

- జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్
- 27,264 మంది తల్లుల ఖాతాల్లో రూ.20.62 కోట్ల జగనన్న విద్యాదీవెన నిధులు జమ

రాయచోటి: ఉన్నత చదువులతో విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో నిర్వహించిన బహిరంగసభ నుంచి బటన్ నొక్కి నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నాలుగో విడత జగనన్న విద్యా దీవెన పథకం కింద నిధులు విడుదల చేశారు. ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, సోషల్ వెల్ఫేర్ డీడీ జాకీర్‌హుస్సేన్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సందప్ప తదితరులు వీక్షించారు.. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జులై 2023 నుంచి సెప్టెంబర్ 2023 త్రైమాసాల 4వ విడత జగనన్న విద్యాదీవెన కింద 29,384 మంది విద్యార్థులకు సంబంధించి 27,264 మంది తల్లుల ఖాతాల్లో రూ.20.62 కోట్లు నేరుగా జమ చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక సహాయాన్ని పేద విద్యార్థులు చక్కగా సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలన్నారు. పేదరికం కారణంగా ఏ విద్యార్థి ఉన్నత చదువులకు దూరం కాకూడదని, చదువుల ఖర్చుతో తల్లిదండ్రులు అప్పులపాలు కాకూడదన్న లక్ష్యంతో జగనన్న విద్యాదీవెన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. అర్హులైన విద్యార్థులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ చేతుల మీదుగా విద్యార్థుల తల్లులకు మెగా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు.

గ్లోబల్ సిటిజన్స్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

- ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డి
- ముగిసిన రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్
- రీజినల్ స్థాయికి 35 ప్రాజెక్టులు ఎంపిక



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌సీఈఆర్టీ రాష్ట్ర డైరెక్టర్ బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను గ్లోబల్ సిటిజన్స్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, అందుకు తగ్గట్టుగా పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తోందని ఎస్‌సీఈఆర్టీ రాష్ట్ర డైరెక్టర్ బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. కడప మరియాపురం సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో జిల్లా సైన్స్ అధికారి బి. మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫేర్ శుక్రవారం ముగిసింది. సైన్స్‌ఫేర్‌కు 26 జిల్లాల నుంచి 234 ప్రాజెక్టులు వచ్చాయి.జ్యూరీ సభ్యులు వాటిని పరిశీలించి వీటిల్లో నుంచి 35 ప్రాజెక్టులను రీజినల్ స్థాయికి ఎంపిక చేశారు. ఇందులో టీచర్ కేటగిరీ కింద 10, గ్రూపు కేటగిరీ కింద 10, మరో 15 ప్రాజెక్టులను వ్యక్తిగత కేటగిరీ కింద ఎంపిక చేశారు. రీజనల్ స్థాయి సైన్స్‌ఫేర్‌కు ఎంపికైన వారికి మెమెంటోలు, షీల్డులు ప్రదాన చేసి అభినందించారు. అనంతరం డీఈఓ ఎద్దుల రాఘువరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముగింపు సభలో ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో 8వ తరగతి చదివే 10 లక్షల మందికి బైజ్యూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లను పంపిణీ చేసినట్లు చెప్పారు.అలాగే 6 నుంచి 10వ తరగతి వరకు 60 వేల తరగతి గదులకు ఇంటరాక్టిక్ ఫ్లాట్ ప్యానల్(ఐఎఫ్‌పి) ఏరాటు చేశామన్నారు. వీటి ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు గ్లోబల్ స్థాయిలో రాణిస్తారన్నారు.ఎస్‌సీఈఆర్టీ సహకారంతో సీబీఎస్‌సీ, స్టేట్ బోర్డు పాఠ్య పుస్తకాలను ముద్రించి విద్యార్థులకు అందించామన్నారు. అలాగే ఐబీ బోర్డు సిలబస్ భారతదేశ వ్యాప్తంగా 256 స్కూళ్లలో ఉంటే ఏపీలో నాలుగు స్కూళ్లలో ఉన్నట్లు తెలిపారు. అనంతరం 26 జిల్లాల్లోని పాఠశాలలకు ఏడాది పొడవునా ఒక్క రోజు కూడా గైర్హాజరు కాకుండా వచ్చిన విద్యార్థులకు, క్రీడల్లో రాణించిన వారికి షీల్డ్‌లను ప్రదానం చేసి అభినందించారు. సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు సంస్కారం నేర్పించాలన్నారు.ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకోవాలని తెలిపారు.డీఈఓ ఎద్దుల రాఘువరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం చదువుకోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. నాడు నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడమే కాకుండా విద్యార్థుల కోసం పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. వీటన్నింటి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓలు రాజగోపాల్‌రెడ్డి, కృష్ణయ్య, జిల్లా సైన్స్ అధికారి మహేశ్వరరెడ్డి, కడప, సీకె దిన్నె ఎంఈఓలు పాలెం నారాయణ, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీచర్ కేటగిరి..

టీచర్	జిల్లా	ప్రాజెక్టు పేరు
లలితాసుభాషిణి	చిత్తూరు	మై కేర్డ్ బెడ్ స్మూతింగ్ అండ్ ఆర్గానిక్ ఫర్ బెడ్‌రిడెన్ పేషెంట్
అంకమయ్య	పల్నాడు	మోడరన్ స్ట్రీట్ లైట్ పోల్
శ్యామ్‌కుమార్	కృష్ణా	ప్రివెన్షన్ ఆఫ్ ఫైర్ యాక్సిడెంట్ ఇన్ హౌస్ అండ్ ఆఫీస్
రఘు రమేష్	అనకాపల్లి	క్రియేటింగ్ ఇంటరాక్టివ్‌వీడియోస్ ఆగ్మెంటెడ్ రియాలిటీ ఇన్‌ఫర్మేషన్
గౌరీశ్వర్‌రావు	శ్రీకాకుళం	లైఫ్ సేఫ్టీ స్టిక్ ఫర్ ఫార్మర్స్
రవి శంకర్	కాకినాడ	ఇన్నోవేటివ్ టీఎల్ఎం
షెహనాజ్ బేగం	నంద్యాల	ఆటోమేటిక్ హ్యాండ్ శానిటైజర్ డిస్పెన్సర్
విజయ్‌కుమార్	కర్నూలు	సైన్స్ టీచింగ్, లర్నింగ్ స్ట్రాటజీస్
రాజారావు	విశాఖపట్నం	కూల్ హెల్మెట్
మహమ్మద్ రఫీ	అనంతపురం	ఆల్ ది కాన్సెప్ట్ ఆఫ్ లైట్ ఇన్ వన్ ఎగ్జిబిట్



వ్యక్తిగత కేటగిరిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులతో అధికారులు

రీజనల్ స్థాయికి ఎంపికైన వారు..

గ్రూపు కేటగిరీ ..

విద్యార్థి	జిల్లా	ప్రాజెక్టు పేరు
మహిత, శ్రీవర్షిణి	ఏలూరు	అవాయిడ్ ట్రైన్ యాక్సిడెంట్
మహాలక్ష్మి నాగచైతన్య	గుంటూరు	స్మార్ట్ మల్టీపర్పస్ చైర్
సాయిబాలాజీ భానుతేజ	అనకాపల్లి	స్మార్ట్ హౌస్
కంజాశ్రీ అమృతవర్షణి	డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ	ఈజీ మిషన్స్ ఇన్ డైలీ లైఫ్
హరిప్రసాద్ అనందకుమార్	తూర్పుగోదావరి	బ్లైండ్ సెన్సార్ గ్లాస్
అరుణ్‌కుమార్ నరసింహా	ప్రకాశం	ఆయిల్ స్కిమ్మర్
ఎం.పావని హిమమాధురి	చిత్తూరు	ఇంటిగ్రేటెడ్ ఫామింగ్ సిస్టమ్
శ్రీహర్ష గణేష్	డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ	ఫ్యూచర్ రోడ్ టెక్నాలజీ
గోపాలకృష్ణ నాగపవన్	కృష్ణా	ఎల్ఐఎఫ్ఐ 6 జి
బెన్నీ మహేంద్రరెడ్డి	అనంతపురం	కవాచీ టెక్నాలజీ రైల్వే లైఫ్స్ ఆపరేషన్ బ్లూటూత్

వ్యక్తిగత కేటగిరీ..

విద్యార్థి	జిల్లా	ప్రాజెక్టు పేరు
చైతన్య	తూర్పుగోదావరి	లోకాస్టు వెంటిలేటర్ అంబు బ్యాగ్
గంగాధర్‌రెడ్డి	నంద్యాల	ఆటోమేటిక్ సోలార్ ట్రాకర్
శిరిషా	వైఎస్సార్	మల్టీపర్పస్ అగ్రికల్చర్ రోబోట్
విశ్వనాథ్	కృష్ణా	లిక్విడ్ ట్రీ
సాత్విక్	ప్రకాశం	హియరింగ్ త్రూ టీత్
అనిలసుధా	బీఆర్ అంబేద్కర్ కోనసీమ	సోలార్ సెన్సార్ క్యాటిల్ షెడ్డు
హేమసాగర్	అనంతపురం	జామెట్రీ డివైస్ ఎకో పైలెట్
సాయి	కాకినాడ	రిమోట్ కంట్రోల్ ఫామింగ్
పూజ	నంద్యాల	ఆటోమేటిక్ డ్రైనేజ్ క్లీనర్
చరణ్‌తేజ	పార్వతీపురం	స్టేర్‌కేస్ క్లైంబింగ్ గ్యాస్ సిలిండర్ ట్రాలీ
హాసినీ	విజయనగరం	స్మార్ట్ ట్రాలీ
అనూహ్యారెడ్డి	అనంతపురం	ట్రాఫిక్ బస్ వితౌవుట్ పొల్యూషన్
మీనా	చిత్తూరు	ఉమెన్ సేఫ్టీ డివైజ్
శివ కౌశిక్	ప్రకాశం	డ్రైవర్ యాంటీ స్లిమ్ అలారమ్
రోహిత్	అన్నమయ్య	ఆర్ఎఫ్ ఐడీబేస్డ్ ఆటోమేటిక్ పెట్రోల్ పంప్ సిస్టమ్

సాధికార యాత్రను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

- ప్రభుత్వవిప్ కొరముట్ల
- జనవరి 3న రైల్వేకోడూరులో బస్సు యాత్ర

రైల్వేకోడూరు: రైల్వేకోడూరులో జనవరి 3న జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాయలంలో రైల్వేకోడూరు , ఓబులవారిపల్లె, పుల్లంపేట, పెనగలూరు, చిట్వేలి నాయకులతో బహిరంగసభ , బస్సు యాత్రలపై సమీక్ష జరిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 79 వేల కుటుంబాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. అలాగే 1600 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తికావచ్చాయన్నారు. సంక్షేమ ఫలాలు అందిన ప్రతి ఒక్కరూ, కార్యకర్తలు యాత్రలో పాల్గొనాలని, సభను విజయవంతం చేయాలని తెలిపారు. ఎన్నికల శంఖారావం ఈ సభ నుంచే పూరించనున్నట్టు తెలిపారు. రాఘవరాజుపురం ముష్టేరు బ్రిడ్జి నుంచి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వరకు యాత్ర కొనసాగుతుందని, అక్కడ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి, సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, డీఏఏబీ చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ముప్పాల హేమనవర్మ, చిట్వేలి మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులరెడ్డి, ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి, ఎల్‌వీ.మోహన్‌రెడ్డి, సుధాకర్‌రాజు, వైకోట సర్పంచ్ ఈశ్వరయ్య, మందల నాగేంద్ర, సీహెచ్.రమేష్, పర్వత విజయ్‌కుమార్‌రెడ్డి, వైఎస్. కరీముల్లా, బండారు మల్లికార్జున పాల్గొన్నారు.

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యల కారణంగా వివాహిత ఆత్మహత్యకు యత్నించిన ఘటన శుక్రవారం కురబలకోట మండలంలో జరిగింది. బలకవారిపల్లెకు చెందిన సుబ్బన్న భార్య బి.శ్యామల(32) కుటుంబ సమస్యలతో మనస్తాపం చెంది ఇంట్లోనే సూపర్ వాస్మోల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు విచారణ చేస్తున్నారు.

టమాటా క్రేట్స్ మీద పడి గాయాలు

మదనపల్లె : టమాటా వాహనంలో కూలిపనులకు వెళ్లిన యువకుడిపై టమాటా క్రేట్స్ మీద పడి గాయపడిన సంఘటన శుక్రవారం ములకలచెరువు మండలంలో జరిగింది. టి.చౌడసముద్రంకు చెందిన హసన్‌వలీ కుమారుడు మహమ్మద్(23) స్థానికంగా ఐషర్ వాహనంలో టమాటా లోడింగ్‌కు వెళుతుంటాడు. ఈ క్రమంలో శుక్రవారం గ్రామసమీపంలో వాహనంలో టమాటాలు లోడ్ చేస్తుండగా, ప్రమాదవశాత్తు టమాటా క్రేట్స్ వాహనంపై నుంచి పడటంతో గాయపడ్డాడు. గమనించిన స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

అగ్ని ప్రమాదంలో టైలర్ షాపు దగ్ధం

పెద్దతిప్పసముద్రం : మండలంలోని తుమ్మరకుంట మెయిన్ రోడ్డులో దుగ్గి నరేష్ అనే టైలర్ షాపు(రేకులషెడ్డు)లో శుక్రవారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మిషన్లతో పాటు కుట్టేందుకు తీసుకున్న దుస్తులన్నీ కాలి బూడిదయ్యాయి. ఈ ఘటనలో రూ.2 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు నరేష్ ఆవేదన వ్యక్తం చేసాడు. ఈ నేపథ్యంలో శనివారం బాధిత కుటుంబ సభ్యులు ప్రమాద ఘటనపై తహసీల్దార్ విద్యాసాగర్‌కు వినతి పత్రం అందజేసి ప్రభుత్వం ద్వారా ఆర్థిక సహాయం అందేలా చూడాలని విన్నవించారు.

హిమోగ్లోబిన్ టెస్టింగ్‌పై అవగాహన

రాయచోటి అర్బన్ : జిల్లాలో గర్భవతులు, బాలింతలు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ టెస్టింగ్ నిర్వహణపై వైద్యసిబ్బంది అవగాహనను పెంచుకోవాలని జాతీయ ఆరోగ్యమిషన్ పర్యవేక్షణాధికారి (డీపీఎంఓ) డాక్టర్ రియాజ్ బేగ్ అన్నారు. స్థానిక ఎన్‌జీఓ హోంలో శుక్రవారం హిమోగ్లోబిన్ టెస్టింగ్‌పై రాయచోటి డివిజన్ ఏఎన్‌యంలకు అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఎన్‌యంలు వారి పరిధిలోని ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలన్నారు. అనంతరం ట్రూ కంపెనీ హెచ్‌బీ మీటర్స్‌ను హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాస్ ఏజెన్సీ తరపున జిల్లాలోని 501 సచివాలయ ఏయన్‌ఎంలకు పంపిణీ చేశారు. సర్వీసు ఇంజినీర్ మహబూబ్‌బాష హెచ్‌బీ మీటర్స్ వినియోగంపై ఏయన్‌ఎంలకు శిక్షణ ఇచ్చారు.

హత్య కేసులో జీవితఖైదు

కడప అర్బన్ : కడప నగరంలోని రాజారెడ్డి వీధికి చెందిన దిద్దుకుంట లోకేశ్వరరెడ్డి అలియాస్ లోక అనే యువకుడిని 2014 ఫిబ్రవరి, 24వ తేదీన మోటార్‌సైకిల్‌పై వెళుతుండగా లాయం సుధా హరినాథ్‌తో పాటు మురహరి విజయ్‌కుమార్, బాతుల సాయి ప్రశాంత్, భీమోళ్ల నరసింహ, ములక లోకోద్ధారరెడ్డిలు సుమోలో వెంబడించి కత్తులతో, కొడవళ్లతో దారుణంగా హత్య చేశారు. ఈ సంఘటనలో నిందితులకు శుక్రవారం కడపలోని జిల్లా కోర్టులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గల్లా శ్రీదేవి జీవితఖైదుతో పాటు, ఒక్కొక్కరికి రూ.3వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

ఘర్షణ కేసులో జైలుశిక్ష

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : ఘర్షణ పడ్డ కేసులో ఇరువురికి జైలు శిక్ష పడిన సంఘటన మైలవరం మండలంలో చోటు చేసుకొంది. ఎస్‌ఐ కృష్ణయ్య కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. 7-5-2023 వ తేది రోజున వేపరాల గ్రామానికి చెందిన అలిశెట్టి కృష్ణయ్య, బడిగింజల శ్రీనివాసులు కుటుంబ సమస్యల కారణంగా బహిరంగ ప్రదేశంలో గొడవపడ్డారు. ఈ క్రమంలో మైలవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. ఇరువురిపై పోలీస్ అధికారులు కేసులు నమోదుచేశారు. శుక్రవారం జమ్మలమడుగు పట్టణంలోని జూనియర్ సివిల్‌కోర్ట్‌లో హాజరు పరచగా సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కె.సి.లక్ష్మయ్య కేసును విచారించి ఇరువురికి నాలుగు రోజుల పాటు జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు.

ప్రకృతి సాగులో విజయనాదం

అతను అందరిలా ఒక పంట గురించే ఆలోచించలేదు..
కరువు దరువేస్తే ఎలా.. అంటూ ఉన్నచోటే ఆగిపోలేదు...
'ప్రకృతి'తో దోస్తీ కట్టి పొలం బాట పట్టాడు..
చిరు ధాన్యానికి జై కొట్టి తనే హలమై ముందుకు కదిలాడు..
అతని శ్రమకు.. సంకల్పానికి భూ తల్లి మురిసిపోయింది..
సాగు చేసిన 'చిరు' ధాన్యాలే.. ధన సిరులై ఇంట కురిపించింది.
పేరును సార్థకం చేస్తూ ముంగిట విజయమై 'సాగు'లా పడిపోయింది.

అవును..
వ్యవసాయాన్ని నమ్ముకున్న వారి బతుకుల్లో సిరులు ఝురులై కురుస్తాయన్న సత్యాన్ని నేలతల్లి రుజువు చేసింది.
ప్రకృతితో మమేకమై దుక్కి దున్నితే జీవితమే 'పచ్చ'గా మారుతుందన్న నిజం మరోసారి లోకానికి తెలిసింది.



ప్రకృతి వ్యవసాయంలో సాగుచేసిన దానిమ్మ తోటవద్ద కొమ్మూరు విజయ్‌కుమార్, పంటల సాగుకు వాడుతున్న సహజ ఎరువు

సాక్షి, కడప డెస్క్ : ప్రకృతి సాగులో కొమ్మూరు విజయ్‌కుమార్ కొత్త చరిత్ర లిఖించారు. చిరు ధాన్యాల సాగులో సిరులు పండిస్తూ ఇతరులకు ఆదర్శనంగా నిలుస్తునారు. కడప నగరానికి ఆనుకొని ఉన్న ఎర్రముక్కపల్లెకు చెందిన కొమ్మూరు విజయ్‌కుమార్ తండ్రి ప్రభుదాస్ పులివెందుల తాలుకా వేంపల్లె సమీపంలో బెరైటీస్ మైనింగ్‌లో ఫోర్‌మెన్‌గా పని చేస్తుండేవారు. దీంతో కుటుంబం వేంపల్లె మండలంలోని టి.వెలమవారిపల్లెకు వలస వెళ్లారు. కుటుంబానికి ఉన్న 6 ఎకరాల భూమిలో కంది, జొన్నతోపాటు ఇతర పంటలను సాగు చేస్తూ జీవనం సాగించారు. 2006లో సొంత పని మీద హైదరాబాద్ వెళ్లిన విజయ్‌కుమార్‌కు అక్కడ కర్నూలు జిల్లా వెంకట్రాంపల్లెకు చెందిన సుబ్బారెడ్డితో పరిచయం చిరుధాన్యాలపై అవగాహన కలిగేలా చేసింది. అనంతరం తనకున్న పొలంలో ఎలా అయినా చిరుధాన్యాల సాగు చేయాలని నిర్ణయించారు. విత్తనాల కోసం తనకు తెలిసినవారి నుంచి కొర్రలను తెప్పించి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేశారు . ఏటా మార్చి- ఏప్రిల్ నెలల్లో విశాఖపట్నం జిల్లా అరకులో జరిగే సమత సంస్థ సభ్యుల (రైతులు) చిరుధాన్యాల ప్రదర్శనకు వెళ్లి అక్కడ చిరుధాన్యాలను సేకరించి తన పొలం పండించడం మొదలెట్టారు. అలా ప్రారంభమైన ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో చిరుధాన్యాల సాగు ఇప్పుడు ఇతర రాష్ట్రాల రైతులకు విత్తనాలను అందివ్వడమే కాక వారికి అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చే స్థాయికి చేరింది. జిల్లాలో 630 ఎకరాలకు పైగా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో చిరుధాన్యాలను సాగు చేయిస్తున్నారు. అందులో వల్లూరు, చాపాడు, ముద్దనూరు మండలాల్లో అధికంగా ఇతర మండలాల్లో పలువురు రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరించేలా వారిని ప్రేరేపించారు.

కుటుంబ నేపథ్యం

కొమ్మూరు ప్రభుదాస్, సుశీలమ్మల పెద్ద కుమారుడైనా విజయ్‌కుమార్ చిన్నతనంలోనే కరెంట్ షాక్‌తో రెండు చేతుల వేళ్లు కొద్దిగా చలనం లేకుండా అయ్యాయి. చదువు కూడా పెద్దగా లేదు. కమ్యూనిస్ట్ భావాలు కలిగిన కుటుంబం కావడంతో చిన్నతనం నుంచే ఆ భావజాలం వైపు అడుగులు వేశారు. అప్పటి రాయలసీమ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (ఆర్‌ఆర్‌డీఎస్) పాల్గొంటూ రైతాంగ సమస్యలపై ఉద్యమాలు, పర్యావరణ పరిరక్షణపై పోరాటాలు చేశారు. గద్దర్‌ను ఇష్టపడే విజయ్‌కుమార్ ఆయన లానే పాటలు పాడి చిన్నా,సన్నకారు రైతులకు, రైతు కూలీలకు అప్పటి భూస్వామ్య కుటుంబాలపై అవగాహన కార్యక్రమాలు చేసేవారు. ఇలా పర్యావరణ పరిరక్షణ ఉద్యమంలో ఉండే సమయంలో హైదరాబాద్‌లో ఉండే పర్యావరణ పరిరక్షణ సభ్యురాలు, కాలమ్ రైటర్ అయిన కవుల సరస్వతి ఈయనకు ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన మెళకువలతోపాటు ఆయన కావాల్సిన సాయాన్ని చేసి మద్దతుగా నిలిచింది. ఆమె స్ఫూర్తి కారణంగా ఈయన తనతో పాటు పలువురిని ఆ వైపు నడిచేలా చేసింది. ప్రస్తుతం తనకు తన కుటుంబానికి ఉన్న 9 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా 6 ఎకరాల్లో చీని, నిమ్మ తోటలతోపాటు 3 ఎకరాల్లో వేరుశనగను సాగు చేస్తున్నారు. గ్రామంలోని ఇతర రైతులతో కొర్ర, అండు కొర్రలను సాగు చేయిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. విజయ్‌కుమార్‌కు భార్య సుగుణమ్మ, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. ఒక కుమారుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీరు కాగా మిగిలిన ఇద్దరు కుమారులు ఈయనతోపాటు వ్యవసాయానికి సహకరించడమే కాక వీరు ప్రారంభించిన వెన్నెల రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ద్వారా రైతులకు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ వారికి కావాల్సిన చిరుధాన్యాల విత్తనాలు, కాషాయాలను అందిస్తూ బాసటగా నిలుస్తున్నారు.

స్వయంగానే కషాయాల తయారీ

విజయ్‌కుమార్ నానమ్మ ఎలీషమ్మ తనకున్న చిన్నపాటి వ్యవసాయంతో పాటు నాటి వైద్యానికి అవసరమయ్యే పసరును తయారు చేసేవాళ్లు. నానమ్మ నుంచి నేర్చుకున్న ఆ విద్యను ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన వాటిని స్వయంగా తయారు చేసుకొని వినియోగించారు. ఇప్పుడు వాటిని ఇతర రాష్ట్రాల్లోని రైతులకు కూడా తన ఆలోచనలు పంచుతూ వారికి అవసరమయ్యే కషాయాలను తయారు చేసుకునేలా తెలియజేస్తున్నారు.

మార్కెటింగ్

రైతులకు ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లేలా చేయడమే కాక వారికి కావాల్సిన మార్కెటింగ్ సైతం అందుబాటులోకి తెచ్చేలా రైతు విజయ్‌కుమార్ చర్యలు తీసుకున్నారు. కొప్పర్తిలోని పారిశ్రామిక వాడలో అవనీ ఆర్గానిక్స్‌ను తీసుకువచ్చి తనలా చిరుధాన్యాల సాగు చేసిన వారి పంటను కొనేలా ప్రణాళికలు చేపడుతున్నారు. రసాయనిక వ్యవసాయం చేసి అప్పుల బాధలు పడుతున్న రైతులు ప్రకృతి వ్యవసాయ విశిష్టతను తెలుసుకొని ఆచరించాలని తెలియజేశారు.

జీవ వైవిధ్య సృష్టి

చిరుధాన్య పంటల జీవ వైవిధ్యానికి అలుపెరుగని కృషి చేస్తున్న కొమ్మూరి విజయ్‌కుమార్ ఇటీవలప్రతిష్టాత్మక సృష్టి సమ్మాన్ పురస్కారం లభించింది. ఈ నెల 23న గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లోని భగవత్ విద్యా పీఠంలో సాత్విక్ సంప్రదాయక ఆహారోత్సవంలో గుజరాత్ మాజీ ప్రధాన కార్యదర్శి పీకే లహరీ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు.





సొంతింటి కల నెరవేరింది



మాకు సొంతిల్లు లేక చాలా ఇబ్బందులు పడ్డాం. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే నవరత్నాలలో ఇల్లు మంజూరైంది. ప్రభుత్వం నుంచి రూ. 1.80 లక్షలు అందడంతో ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకున్నాం. ఇటీవల గృహప్రవేశం కూడా చేశాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చలవతో మా కల సాకారమైంది. – కె చిన్నమ్మ, నాగిరెడ్డిగారిపల్లె, సంబేపల్లి మండలం.

నాడు-నేడుతో విద్యాభివృద్ధి



గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేసి విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారు. ఓ వైపు పాఠశాలల్లో వసతులు, మరో వైపు విద్యార్థులకు విద్యా సామగ్రి సకాలంలో అందిస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో విద్య అందుతోంది. గతం కంటే ఫలితాలు మెరుగు పడ్డాయి. అందుకే ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న నా కుమారుడు పఠాన్ అయాన్ అలీ ఖాన్‌ను 8వ తరగతి నుంచి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాను. విద్యలో కూడా బాగా రాణిస్తున్నాడు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇన్ని వసతులు కల్పించిన జగనన్నకు కృతజ్ఞతలు. – పఠాన్ అఫ్జల్ అలీ ఖాన్, కమలాపురం.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు


ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఆనందమ్మ

మదనపల్లె : వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడి, స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రామసముద్రం మండలం చెంబకూరు పంచాయతీ బైరాజులపల్లెకు చెందిన సీతారామరాజు కుమారుడు ఎస్.సంతోష్(23) గురువారం రాత్రి ద్విచక్రవాహనంలో చెంబకూరు నుంచి వస్తుండగా, మార్గమధ్యంలోని గజ్జెలవారిపల్లె వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ప్రమాదంలో సంతోష్ తీవ్రంగా గాయపడగా, స్థానికులు రామసముద్రం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. రామసముద్రం పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు. అదేవిధంగా మదనపల్లె మండలం వలసపల్లెకు చెందిన ఆనందమ్మ(48) తన కుమారుడు శ్రీనివాసులుతో కలిసి ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వస్తుండగా, బసినికొండ వద్ద రోడ్డుపై ఉన్న స్పీడ్‌బ్రేకర్‌పై వాహనం దిగడంతో ఆమె అదుపుతప్పి కిందపడింది. ప్రమాదంలో ఆనందమ్మ తీవ్రంగా గాయపడగా, స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యచికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆమెను తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

అంతర్రాష్ట్ర దొంగలముఠా అరెస్ట్

బంగారం, ద్విచక్రవాహనాల స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

కలకడ : అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసి వారివద్ద నుంచి 11 బంగారు గొలుసులు, రెండు ద్విచక్రవాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు రాయచోటి డీఎస్పీ సయ్యద్ మహబూబ్‌బాష తెలిపారు. ఈ నెల 7వ తేదీ నుంచి చుట్టుపక్కల పట్టణాల్లో 11 బంగారు గొలుసులు చోరీకి గురైనట్లు అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. ఈ క్రమంలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన సయ్యద్ ఇర్ఫాన్ బాష, షేక్ అర్షద్ బాష, షేక్ అర్బాజ్ బాష, కలికిరి టౌన్‌కు చెందిన షేక్ మహబూబ్ బాష, షేక్ మహమ్మద్ అలీలను శుక్రవారం అరెస్టు చేసి వారి వద్దనుంచి రూ.16,74,000 విలువైన 11గొలుసులు, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. దొంగలముఠాను అరెస్ట్ చేసిన ఎస్‌ఐ తిప్పేస్వామి, సీఐ నాగేంద్రను జిల్లా ఉన్నతాధికారులు అభినందించారు.

హత్యాయత్నం కేసులో నలుగురు అరెస్ట్

ములకలచెరువు : ఓ హత్యాయత్నం కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ గాయత్రి శుక్రవారం తెలిపారు. ఆమె కథనం మేరకు.. మండలంలోని చౌడసముద్రం సమీపంలో బీజేపీ రాష్ట్ర కో-ఆపరేటివ్ సెల్ జాయింట్ కన్వీనర్ బి.గోపాల్ రెడ్డి(58)పై అదే పార్టీకి చెందిన తిమ్మ శేఖర్, మహేశ్వర్‌రెడ్డిలు గురువారం దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. వీరిద్దరితో పాటు దాడికి సహకరించిన మహమ్మద్ షరీఫ్(27), ప్రశాంత్(25)లను శుక్రవారం తంబళ్లపల్లి క్రాస్ వద్ద ఉండగా అదుపులోకి తీసుకున్నారు. పార్టీ కార్యక్రమాలపై తమకు సమాచారం అందించకపోవడంతోనే కక్షతో గోపాల్ రెడ్డి పై దాడి చేసినట్లు విచారణలో నిందితులు అంగీకరించారు. వీరిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

ట్రాక్టర్ కింద పడి మహిళ మృతి

ఖాజీపేట : పంట పొలంలోని మినుము కట్టె నూర్పిడి చేసే ట్రాక్టర్ కింద పడి రావులపల్లె గ్రామానికి చెందిన పోతుల వెంకట సుబ్బమ్మ అనే మహిళ శుక్రవారం మరణించింది. చందిన జయరామిరెడ్డి పొలంలో పంట నూర్పిడి తరువాత ఒక కయ్య నుంచి వేరొక కయ్య దాటుతుండగా కిందపడింది. ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ ఆమె పై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఖాజీపేట ఎస్‌ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి మృతదేహాన్ని పరిశీలించారు. సంబంధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టం కోసం కడప రిమ్స్‌కు మృతదేహాన్ని తరలించారు.

సోమశిల బ్యాక్ వాటర్‌లో శవం

ఒంటిమిట్ట : మండల పరిధిలోని కోటపాడు వద్ద ఉన్న శ్రీరామ ఎత్తిపోతల పంపు హౌస్ సమీపంలోని సోమశిల వెనుక జలాలలో శుక్రవారం గోనెసంచిలోని శవం కలకలం రేపింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కోటపాడు శ్రీరామ ఎత్తిపోతల పంపు హౌస్ సమీపంలో గల సోమశిల వెనుక జలాలలో అనుమానాస్పదంగా ఓ గోనెసంచి మూట కనిపించడంతో అక్కడే ఉన్న స్థానికులు ఒంటిమిట్ట పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న సీఐ పురుషోత్తం రాజు, ఎస్‌ఐ మధుసూదన్‌రావు తమ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని గోనెసంచిని విప్పి చూశారు. అందులో ఒక మగ శవం కనిపించింది. శవాన్ని చూసిన పోలీసులు బయటకు తీసి బాడీని పరిశీలించారు. అనంతరం మృతుడికి సంబంధించిన కుడి చేతిపై ఇందిరా అని పచ్చబొట్టు, ఇంకా షర్టు కాలర్‌పై హైదరబాద్‌లోని అమీర్‌పేట్ వైఈఎక్స్ టైలర్ షాప్ గుర్తును గుర్తించారు. దీనిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, పూర్తిగా చెడిపోయి ఉన్న మృతదేహాన్ని ఘటనా స్థలంలోనే రిమ్స్ నుంచి వచ్చిన డాక్టర్‌తో పోస్టుమార్టం నిర్వహింపచేసి, అక్కడే ఖననం చేశారు.

శాంతి భద్రతలు భేష్

2023 నేర గణాంకాలను వివరించిన ఎస్పీ కృష్ణారావు


మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కృష్ణారావు

రాయచోటి : పోలీస్ శాఖ సమర్థవంతమైన సిబ్బంది పనితీరు, మెరుగైన పోలీసింగ్ అమలువల్ల ఈ ఏడాది నేరాలు తగ్గాయని జిల్లా ఎస్పీ బి కృష్ణారావు తెలిపారు. శుక్రవారం రాయచోటి పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ ఈ ఏడాది చివరిలో క్రైమ్ రేట్ వివరాలను వెల్లడించారు. అందుబాటులో ఉన్న అధునాతన సాంకేతికత, ప్రభుత్వ సహకారం పోలీసు శాఖ పరంగా వినూత్నమైన మార్పులు తీసుకురావడంతో జిల్లాలో శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయన్నారు. శాఖాపరంగా ఈ ఏడాది సాధించిన సత్ఫలితాల స్ఫూర్తితో రానున్న ఏడాది కూడా మరింత మెరుగ్గా పోలీసులతో ప్రజలకు ఉత్తమ సేవలను అందిస్తామన్నారు. 2022తో పోలిస్తే ఈ సంవత్సరం అన్ని రకాల నేరాల నియంత్రణలో గణనీయమైన మార్పు కనిపించిందన్నారు. హోం గార్డు, కానిస్టేబుల్, ఎస్‌ఐ ఆపైన స్థాయి నుంచి ఏఎస్పీ స్థాయి వరకు సమర్థవంతంగా విధులు నిర్వహించారని ఎస్పీ కితాబిచ్చారు. జిల్లాలో 23శాతం మేర నేరాలు తగ్గుముఖం పట్టాయన్నారు. 2022లో 6079 కేసులు నమోదుకాగా 2023లో 4920 కేసులు మాత్రమే నమోదయ్యాయని తెలిపారు.

- జిల్లాలో గత ఏడాతితో పోలిస్తే హత్యలు కొంత మేర పెరిగాయని ఎస్పీ తెలిపారు. గత ఏడాది 35 హత్య కేసులు నమోదు కాగా ఈ ఏడాది 44 హత్యలు జరిగాయన్నారు.

తగ్గుముఖం పట్టిన అత్యాచారాలు.....

అత్యాచారాలు, వరకట్నం, పాక్సో, మహిళల వేధింపుల కేసులు ఈ ఏడాది తగ్గాయన్నారు. గత ఏడాది 644 మంది పై అత్యాచారం, వరకట్నం వేధింపుల కేసులు నమోదు కాగా ఈ సంవత్సరం 439 మాత్రమే నమోదయ్యాయన్నారు. అలాగే పాక్సో కింద గత ఏడాది 46 నమోదు కాగా ఈ సంవత్సరం 37 కేసులు మాత్రమే నమోదయ్యాయని తెలిపారు. దోపిడి, దొంగతనం కేసుల్లో గత ఏడాది 382 కేసులు నమోదు కాగా ఈ సంవత్సరం 330 నమోదైనట్లు చెప్పారు.

- జిల్లాలో వివిధ కేసుల పరిష్కారంలో పోలీసు చర్యలు సత్ఫలితాలు ఇచ్చాయి. గత ఏడాది 9728 కేసులు పరిష్కారం కాగా ఈ ఏడాది 13468 కేసులను రాజీ ద్వారా పరిష్కారం చేపట్టారు.
- జిల్లా పరిధిలోని పలు కేసుల ఛేదనలో పోలీసులు చూపిన తెగువకు ఎస్పీ రివార్డులను ప్రకటించారు. సమావేశంలో ఎస్‌బీఐ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, డీసీఆర్‌బీ సీఐ వరప్రసాద్, ఏఆర్ సీఐ మహబూబ్ వలి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

కలికిరి : నెళ్ళపల్లి గ్రామం మూరేవాండ్లపల్లికి చెందిన జరుగుమల్లి సిద్దయ్య(72) ఈ నెల 23న తన పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు కలికిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో సిద్దయ్య శుక్రవారం మృతి చెందాడు. ఆయన భార్య ఈశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఒకరి అదృశ్యం

కడప అర్బన్ : కడప నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సాయిపేటకు చెందిన షేక్ సాదిక్ (30) ఈనెల 28వ తేదీ నుంచి కనిపించడం లేదని, అతడికి మతిస్థిమితం సరిగా లేదని పోలీసులకు కుటుంబసభ్యులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప టూటౌన్ పోలీసులు తెలియజేశారు.